# అతకని బ్రతుకులు

రైలు వేళకే వచ్చింది. ఆడవాళ్ళ కంపార్టుమెంటులో ఎక్కి, కూలివాడు తెచ్చిన సామాను లెక్క చూసుకుని సర్ది, పిల్లల్ని దగ్గరగా కూర్చోపెట్టుకుని కిటికీవద్ద కూర్చుంది సుజాత. ఒక్కొక్క స్టేషన్ దాటుతున్నకొద్దీ ఆమె గుండె దడదడ లాడుతోంది. దిగే ప్రయాణీకుల సామానులతో పొరబాటున తమ సామాన్లు కలిసి పోవచ్చు. దొంగలైనా చల్లగా పట్టుకుని జారుకోవచ్చు. ఎందుకైనా మంచిది అని తన సామాన్లు గడియ గడియకూ చూసుకుంటోంది...తల యెత్తి పైకి చూసేసరికి 'దొంగలున్నారు జాగ్రత్త' అని రైల్వే వారు ప్రయాణీకులకు హెచ్చరికగా వ్రాసిన నల్లని అక్షరాలు కళ్ళ యెదుట నాట్యం చేస్తున్నట్టనిపించింది. ఈ పరిస్థితిలో తన వెంట భర్త కూడా వుంటే తనింత భయపడేది కాదు....కాని, అతడు క్యాంపులో వున్నాడు.

సాయంత్రం అయిదు గంటలకు రైలు విశాఖపట్నం చేరింది.

గుమ్మంలో రిక్షా ఆగీ ఆగడంతోనే వీధిఅరుగు తుడుస్తున్న పని మనిషి చేతిలో చీపురుతో సహా గబ గబా వచ్చింది 'అమ్మగారూ' అంటూ.

సుజాతకు గుండె ఆగినంత పనైంది. తమ యింటి తాళం దొంగలు పగలగొట్టలేదు కదా! ఎందుకిలాగ ఖంగారుగా వచ్చింది అనుకుంది. అయినా ఇక భయపడ్డం దేనికి? తను రానేవచ్చింది. ధైర్యంగా వుండాలి అని తనను సమాధానపరుచుకుంది.

'బాగున్నావా'? అంటూ పని మనిషిని పలకరించి, అది మాట్లాడ్డానికి సందివ్వకుండా గబగబా సామాన్లు అరుగుమీద పెట్టించి డబ్బులిచ్చి రిక్షావాడిని పంపేసింది సుజాత.

ఇంతలో ఇల్లుగల ఆమె లోపలినుండి వచ్చింది.

"వచ్చావా అమ్మాయి...అంతా బాగున్నారా, వుత్తరం అందిందా?" అని పలకరించింది.

"బాగున్నారు అంతా పిన్నిగారూ! ఆయన ఇంకా వారం రోజులవరకూ రారు....అయినా మీ వుత్తరం అందడంవల్ల అర్జంటుగా వచ్చేశాను" అంది సుజాత.

"వ్రాయకుండా వుందామనుకున్నాను. కాని, రోజు రోజూ దొంగతనాల గురించిన వార్తలు రకరకాలుగా చెప్పుకుంటున్నారు. చలి కాలంకదా....అంతా ఇళ్ళల్లో పడుకుంటారు. పిలిచినా పలకరు.



మీ యింటి తాళం బైటకి కనబడుతోంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేం. నేనా పెద్దదాన్ని. ఒంటరిదాన్ని....పదిగంటలు దాటిందంటే వీధితలుపు తీసుకుని ఇవతలకి రావడానికే భయంకదా!



వేదుల మీనాక్షీదేవి

అందుకని వ్రాశానమ్మా" అందామె.

"అదేమిటీ పిన్నిగారూ! మా సామాను చూసుకోవలసిన పూచీ మాకు లేదూ? అన్ని విధాల సంజాయిషీ చెబుతున్నారేమిటీ? ఇంకా నయం" అంది సుజాత.

తమ ఇంటి తలుపు తాళం తీస్తుంటే చేతులు వణికాయి— శీతాకాలం అవడంవల్ల ఆరుగంటలకే చీకటి పడిపోయింది. తలుపులు

తీసేసరికి లోపల తలుపులన్నీ బార్లా పెట్టివుంటే.... బీరువాలు.... వెండి సామాన్లు.... ఒకటేమిటి.... ఎన్నో విలువైనవి వున్నాయి

ఊపిరి బిగబట్టుకుని తాళం తీసింది.... పక్కనేవున్న స్విచ్ వేసింది. పట్ట పగల్లాగ గదంతా ప్రకాశవంతమైంది. మెల్లిగా ఒక్కొక్క తలుపే తీసింది వంటింటి వరకూ.... ఏ తలుపులూ తీసి లేవు. వేసినవి వేసినట్లే వున్నాయి అంతవరకూ!

'అమ్మయ్య' అనుకుంది. అయినా ప్రతిక్షణం ఎవరో వెనుక వస్తున్నట్లు, కిటికీలోంచి చూస్తున్నట్లు అనిపించి కిటికీల తలుపులు మూసివేసి, సీలింగ్ ఫాన్ ఆన్ చేసింది. వీధి గది కిటికీలు మాత్రం తెరిచి వుంచింది.

కొంతవరకు ఆమె మనస్సు కుదుటపడింది. అప్పుడు సామాన్ల సంగతీ పిల్లల సంగతీ జ్ఞాపకం వచ్చి ఖంగారుగా వీధిగుమ్మంలోకివచ్చింది. పనిమనిషి సామానులోపల పెట్టింది కాబోలు తను చూడనేలేదు! పిల్లల మాటలు వినబడుతున్నాయి. ఇల్లుగల ఆమె దగ్గిర వాళ్ళకి బాగా అలవాటు. చాలారోజులకు ఆమెను చూడ్డంవల్ల వాళ్ళ ఆనందానికి అవధిలేదు- తెగ కబుర్లు చెప్పేస్తున్నారు.... పసివాళ్ళు.... అమ్మ ఖంగారు!.... పరిస్థితులు, బెంగలు, బాధ్యతలూ.... వాళ్ళకేం తెలియవు. .... అదే అదృష్టవంతమైన దశ కదా.... అనుకుంది సుజాత.

పిలిచి భోజనం పెట్టి నిద్ర పుచ్చింది.

ఇంటివారి వాటాకి, వాళ్ళ వాటాకి మధ్య గుమ్మాలున్నాయి. భర్త వూళ్ళోలేనప్పుడు పడకగదిలో తలుపులు తీసి పడుకుంటారు. ఇల్లుగల ఆమె అవతల గుమ్మం దగ్గరగా పడుకుంటుంది. ఆమె వీరికి


విజయ

అనుబంధ మాలిక

మే నెల నవల

దాశరథి రంగాచార్య రచన

'మానవత'

సాయం అన్నమాట. ఇప్పుడూ అలాగే పడుకున్నారు.

రకరకాల కలలతో సుజాతకి కలతనిద్రే అయింది.

తెల్లవారింది.

దుమారంలాగా వచ్చింది పని మనిషి.

"అమ్మగారూ నిన్న దీపాల వేళండీ, మన పక్క వీధిలో రామమ్మగారి అరుగు మీద మంచాలు ఎవరో పట్టుకు పోయారండీ. పాపం....మా వీధిని భార్యా భర్తా సినిమాకెడితే వాళ్ళు వచ్చేసరికి ఇల్లంతా దోచుకుపోయారుటండీ। మరేమోనండీ,...ఆ పక్కింట్లో కిటికీలోంచి కొంకి కర్రతో దండేలమీద బట్టలు లాగి పట్టుకు పోయారండీ."

ఇలాగ చెప్పుకుని పోతున్న పని మనిషి "ఆగు" అన్న సుజాత గద్దింపుతో చెప్పడంమాని, తెల్లబోయి చూసింది.

"ఇక చెప్పకు....ఇంతవరకూ చెప్పింది చాలు.... నీపని చూసుకో వెళ్ళి" అంది సుజాత.

అన్నదే కాని....పాపం దాని తప్పేముంది... ఎవరోచెప్పుకుంటే వింది. దొంగతనాలతో వూరంతా అట్టుడికినట్టుడికి పోతుంటే అది చెప్పిందని కోపగించుకోవడంలో అర్థంలేదు. అయితే తనకి యిటు వంటివి వింటే నెర్వెస్‌గా ఫీలవుతున్నట్లుంది.

పనిమనిషిని కేకలేసినందుకు జాలివేసింది ఆమెకు,దానిని ఆపగలిగింది గాని ఇరుగుపొరుగు వారిని వారించలేక పోయింది. తాము వూరినుండి వచ్చారని చూడ్డానికి వచ్చి,యెవరు విన్న మాటలు వారు చెప్పారు.

ఇక, తనభర్త ఆఫీసులోని నరసింహంగారి భార్య మూడు వీధుల అవతలనుండి వచ్చింది। ఆ రెండు కుటుంబాలకూ పాలమనిషి ఒకర్తే. అందువల్ల ఆమెకు వారి రాక వెంటనే తెలిసిపోయింది।।

ఇటీవల వాళ్ళింట్లో దొంగతనం జరిగిందని వింది సుజాత. ఆమె వస్తూనే దొంగల కబుర్లే ప్రారంభించింది. వంటింట్లో సామానంతా పట్టుకుపోయారుట. భర్త కొత్తగా కుట్టించుకున్న బట్టలు పెట్టిన పెట్టె, తన పట్టుబట్టల పెట్టె పట్టుకు పోయారుట। పోలీసు రిపోర్టు ఇచ్చారట। పోలీసు స్టేషనుకి వెళ్ళి చూసేసరికి అక్కడ పోగువేసిన మడత మంచాలు, ట్రంకుపెట్టెలు.... సూట్‌కేసులూ, రకరకాల బట్టలూ వున్నాయిట. పోలీసులు చూపించారుట. కళ్ళు చెదిరిపోయాయిట।

అందులో వారివేవీ లేవుట!!

ఈ విధంగా రెండు గంటల సేపు ప్రత్యక్ష పురాణంలాగా చేతులూ, కళ్ళూ తిప్పుకుంటూ చెప్పింది.... వెళ్ళేటప్పుడు వీధి గుమ్మం దిగి "మగేం....పగలు ముష్టి, రాత్రి మధుకరం అంటూ వచ్చి చేతికందినవి పట్టుకుపోతున్నారు. మీ వారు వూళ్ళో లేరు కూడాను....జాగ్రత్త సుమా" అని గట్టిగా నాలుగు వీధులు వినబడేలా హెచ్చరించి మరీ వెళ్ళింది.

ఆయన వూళ్ళో లేరని అంత గట్టిగా చెప్పాలా? దొంగా మనిషి లాంటివాడే .... ఎవరైనా వింటే! ...ఏమిటీమనిషితరహా అనుకుంది సుజాత ఆమె గురించి.

తను అనుకొన్నంత భయం లేకపోయింది. క్రమంగా మామూలులో పడింది....అయిదు రోజులు గడిచాయి. రెండు రోజుల్లో వస్తున్నట్లు భర్త వుత్తరం వ్రాశాడు.

అప్పటికి పగలు 11 గంటలయింది. అందరి ఇళ్ళల్లోనూ భోజనాలయి విశ్రాంతి తీసుకునేవేళ.... పిల్లలు నిద్రపోతున్నారు.

గదిలో పడుకుని నవల చదువుకుంటున్న సుజాత పెరట్లో నీళ్ళ చప్పుడు వినబడి తలుపు తీసి చప్పున పెరట్లోకి వెళ్ళింది. నీళ్ళ బాల్చీ చేతపట్టుకుని. మొక్కలకు నీళ్ళు పోస్తున్నాడొక వ్యక్తి.

"ఎవరు నువ్వు?" అంది గట్టిగా సుజాత.

నీళ్ళు పోస్తున్నవాడు లేచి నిలబడి వెనక్కి తిరిగి చూశాడు. ఆ చూసినవాడు చూసినట్లే నిలబడి పోయాడు!

'అమ్మాయిగారూ!.... ఈ వూళ్ళోవున్నారా?" అన్నాడా వ్యక్తి నిశ్చేష్టుడై.

"సన్యాసీ....నువ్వా!" అంది నిర్ఘాంతపోతూ సుజాత.... ఎదుట కనబడుతున్న వ్యక్తి ఫేడవుటయి. గతం ఫేడిన్ అయింది....

* *

అది సుమారు తొమ్మిది సంవత్సరాల క్రితం విషయం. సుజాత హైస్కూల్లో చదువుతున్న రోజులు

ఏలూరులో వాళ్ళకి స్వంత యిల్లుంది. తండ్రి అక్కడే పోస్టుమాస్టరు. ఆ పేటలో చిన్నపిల్లలకోసం ప్రత్యేకంగా స్కూలు ఒకటి పెట్టారు. దూరం నుండి వచ్చే పిల్లలు రిక్షాలో వచ్చేవారు. నౌకర్లున్నవాళ్ళు సైకిళ్ళమీద వచ్చేవారు. ఆ స్కూల్లో సన్యాసి బంట్రోతు. ఆ చుట్టుపక్కల పిల్లల్ని సన్యాసి తీసుకువెళ్ళి, జాగ్రత్తగా తీసుకువస్తాడు

స్కూలు నుండి యిళ్ళకు. సుజాత తమ్ముణ్ణి, చెల్లెల్ని సన్యాసిస్కూలుకి తీసుకువెళ్ళటానికి ఏర్పాటు చేశారు. వాళ్ళనాన్న. సన్యాసి రా గా నే హుషారుగా పరిగెత్తుకుని వెళ్ళే వారు వాళ్ళిద్దరూ. కబుర్లు చెబుతూ, నవ్విస్తూ తీసుకువెళ్ళేవాడు సన్యాసి.

ఆ విధంగా పరిచయమైన సన్యాసి క్రమంగా ఆదివారాలలో తమతోటపని చూసేవాడు. స్కూల్లో కూడా తోటని చూస్తూండేవాడు. అందువల్ల అతని కా పని బాగా తెలుసు. తమ యింట్లో పాదులకు పందిళ్ళు వెయ్యడం, పూలమొక్కలకు, పళ్ళమొక్కలకు పాదులు చేసి, వాటి సంగతి చూడ్డం వంటి పనులు చేస్తూండేవాడు. ఆనాడు సన్యాసి భోజనం అక్కడే....

సన్యాసి స్వంత వూరు తునిట. తండ్రిలేడు. తల్లి అక్కడే వుందిట. స్వంతానికి చిన్న తాటాకు ఇల్లు రెండు గదులది వుందిట. పనికోసం ఆ వూరునుండి వస్తున్న కొందరితో కలిసి వచ్చిన సన్యాసి ఎవర్నో ఆశ్రయించి ఆ స్కూల్లో బం ట్రోతు పని సంపాదించాడుట.

తమ అన్నయ్య పెళ్ళికి సన్యాసి యెన్నో పనులు చేశాడు. వచ్చిన బంధువులు యెక్కడి వారక్కడికి వెళ్ళేవరకూ, ఎక్కడ చూసినా తానే అయి, పిలిచిన వారికల్లా పలుకుతూ, చెప్పిన పనులు కాదనకుండా చేశాడు। అందరూ అతన్ని యెంతో మెచ్చుకున్నారు.

అలా ఆ సన్యాసికీ, తమ కుటుంబానికీ ఒక విధమైన ఆప్తత ఏర్పడింది. ఏది చేసినా సన్యాసికి పెట్టవలసిందే।.... ఏ పనివున్నా అతడు చెయ్యవలసిందే....

నమ్మిన బంటుగా అయిపో యాడు యింట్లో.

ఆ విధంగా నాలుగేళ్లు గడిచాయి.

సన్యాసి తల్లికి జబ్బుగా వుం దనీ, వున్నపాటున రమ్మనీ కబురు వచ్చి పదిరోజులు స్కూలు కి సెలవుపెట్టి వెళ్లాడు సన్యాసి.

ఆ గడువు దాటినా రాలేదు. నెలా.... రెండు.... నెలలు....వాడు వచ్చే జాడలేదు.

కాలం ఎవరి కోసం, ఎందు కోసం ఆగదు.

పనులూ అంతే.... వ్యక్తుల కోసం ఆగవు.

జరగవలసిన పనులు జరిగి తీర వలసిందే।

స్కూల్లో కొత్త నౌఖరు వచ్చాడు.

స్కూలు పనులు నిరాఘాటంగా జరిగి పోతున్నాయి.

సుజాతకి పెళ్ళయింది. భర్త

రామారావు జూనియర్ డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్. రెండు మూడు వూళ్లు ఉద్యోగరీత్యా తిరిగి. ఏడాది క్రితం విశాఖపట్నం వచ్చారు. వస్తూనే ఆ యింట్లోకి కాపురం వచ్చారు. అయిదు సంవత్సరాలైంది పెళ్ళై. ఇద్దరు మగ పిల్లలు....

సన్యాసి నెలలతరబడి ఎక్కడో తిరుగుతున్నాడనీ, ఇంటికి ఎప్పుడో గాని రావడం లేదనీ, ఎక్కడికి వెళ్ళావనీ, ఏం చేస్తున్నావనీ తల్లీ, బంధువులూ యెంత అడిగినా ఏం చెప్పడంలేదనీ, ఆ తల్లి గోలపెడుతోందని గాలి కబురుగా తెలిసిందని సుజాతకి తెలిసింది. పుట్టింటికి వెళ్లినప్పుడు. సన్యాసి తండ్రీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్ళిపోయాడట. ఇప్పుడు సన్యాసికీ తండ్రి పోలిక లెక్కడకు పోతాయనుకున్నారంతా.

గతం అంతా కళ్లముందు సినిమా రీలులాగా గిర్రున తిరిగి పోయింది సుజాతకి.

"పట్టుకోండి....పట్టుకోండి. ఈ యింటిలోనే దూరాడు" కేకలు దూరంగా వినబడుతూ, క్రమంగా దగ్గరైనాయి.. వీధి గేటు కిర్రున చప్పుడైంది. గుంపుగా జనం పెరట్లోకి వచ్చారు.

ఆ సంఘటనతో గతం నుండి ప్రకృతానికి వచ్చింది సుజాత.

ఏమిటో అర్థం గాక వాళ్లకేసి చూస్తోంది.

"అడుగో .... వాడే .... పట్టుకోండి" అంటున్నారు వచ్చినవాళ్ళు.

"ఏమిటి మీ రంటున్నది?" ఆశ్చర్యంగా అడిగింది సుజాత.

"అమ్మా-వీడు ఈచివర ఇంటి పెరట్లో ప్రవేశించి, ఆరుతున్న బట్టలు తీసుకొని గోడవతల గిరవాటు వేస్తూండగా ఆ యింట్లో వాళ్ళు చూసి కేకలు వేశారు. గోడ అవతల మరొకడు వుండి వాటిని పట్టుకు పారిపోయాడు. కొందరు వాడిని తరుముకుంటూ అవతల వీధికి వెళ్లారు. మేము వీడిని వెంబడించి వస్తూంటే మీ పెరటి గోడ దూకడం చూశాం...." అన్నారు.

దిమ్మెర పోయింది సుజాత.

తన చెవులను తానే నమ్మలేక పోతోంది.

సన్యాసివైపు చూసింది.

వాడు యిదేమీ గమనించనట్లు దూరంగా మొక్కలకు మొదళ్ళలో పళ్లాలులాగా చేసి, చెంబుతో నీళ్లు పోస్తున్నాడు.

సుజాత క్షణం ఆలోచించింది.

"వీడు మా పనివాడు. ఇక్కడకి దొంగ యెవరూ రాలేదు. ఇందాకటినుండి నే నిక్కడే

వున్నాను.మీరు పొరబడుతున్నారు. అసలు దొంగ యెటు వెళ్లాడో చూసుకోండి. ఒక వేళ మా పెర ట్లోకి దూకినా యిక్కడనుండి అవ తల వార్రి పెరట్లోకి దూకి తప్పించు కోవచ్చును కదా! వాడు చెయ్యి జారిపోకుండా వెళ్ళి పట్టుకోండి." అంది సుజాత.

"వీడేనండి మేం చూసినవాడు" అన్నాడు ఆ గుంపులోని ఓ కుర్ర వాడు.

"వీడే అని గుర్తేమిటబ్బాయ్! మనిషినిపోలిన మనిషివుండవచ్చు. దానికేం. ఇంతకీ వీడు మా నౌకరు అని చెబుతున్నాను కదా! వెళ్ళండి" అంది ఆమె.

"నిజంగా వీడు మీ నౌకరే అయితే యింత గొడవ జరుగు తుంటే ఏమిటో చూద్దామనైనా రాకుండా వుంటాడా?" అన్నా రొకరు.

"అయ్యో రామా! వాడికి పుట్టెడు చెముడు" అంది సుజాత.

తనలో అంత ధైర్యం, సాహసం, ఆలోచనా యెలా వచ్చాయో ఆమెకే ఆశ్చర్యంగా వుంది.

"మేం వెడతాంగాని.ఆ బాల్చీ. చెంబూ పట్టుకుపోకుండా చూసు కోండి" అన్నాడు వెనకటి కుర్ర వాడు.

వచ్చిన వాళ్లు వెళ్లిపోయారు.

వాళ్లున్నంతసేపూ నదురూ బెదురూ లేకుండా మొక్కలకు సంరక్షణ చేస్తూ.నిశ్చలంగా వున్నా డంటే వీడు దొంగతనంలో బాగా ఆరితేరిన వాడన్నమాట.

పెరట్లో నీళ్ళ చప్పుడై తను వచ్చి చూసినప్పుడు మొక్కలకు నీళ్లు పోస్తున్న సన్యాసిని గుర్తించి నప్పుడే అంతరాంతరాలలో ఏదో అనుమానం పీడించసాగింది.

పోనీ దొంగగా కాక చూడ్డానికి వచ్చాడనుకొందు కాస్కారంలేదు. తననుచూడగానే ఆశ్చర్యపోయాడు సన్యాసి. తనా వూళ్లో వున్నట్లు వాడికి తెలియదు.

అందువల్ల ఆ జనం చెప్పిన మాట ముమ్మాటికీ నిజమే అనిపిం చినా....తన కర్తవ్యం ఏమిటి అని ఆలోచించింది సుజాత.

ఎంత తెలిసినవాడైనా 'దొంగ' అని అనుమానం కలిగేసరికి అంత రాంతరాల్లో భీతిగానే వుంది ఆమెకు.

తలెత్తి చూసింది....

సన్యాసి మొక్కలకు నీళ్లు పొయ్యడంలేదు.

వచ్చి ఎదురుగా నిలబడివున్నాడు తలవంచుకొని.

వాడి కళ్ళవెంట బొటబొట నీళ్లు రాలుతున్నాయి.

"జనం వెళ్లిపోయారు.... ఇక వెళ్లు" అంది సుజాత. దొంగగా తమ పెరట్లోకి వచ్చినా తన కళ్ళ ముందువాడిని ప్రజలు పట్టుకోవడం, తలోక దెబ్బ కొడుతూ తీసుకు వెళ్ళడం తను చూడలేదు. అటువంటివి చిన్నప్పుడు వీధిలో అప్పుడప్పుడు జరుగుతూంటే తను గిలగిల్లాడేది "కొట్టకండి, కొట్టకండి" అంటూ. అటువంటిది తెలిసినవాడి విషయంలో మరీ బాధ కదా!

స్వతంత్ర దేశంలో దొంగల్ని పట్టివ్వడం పౌరులందరి కర్తవ్యం అనీ, దొంగతనం కప్పిపుచ్చడం, నేరస్తుల కాశ్రయం యివ్వడం నేరం అనీ తనకు తెలుసు. ఐతే సన్యాసి తన యింట్లో దొంగతనానికి రాలేదు. ఏదీ ఎత్తుకు వెళ్ళే ప్రయత్నం చెయ్యలేదు. దొంగ సొత్తు వాడి దగ్గర లేదు. ఎవరో దొంగ అన్నంత మాత్రాన తను కూడా దొంగ అని నిర్ణయించి వాళ్ళకు అప్పగించలేదు. అంతే... అందువల్ల తను చేసిన పనిలో తప్పు లేదు అని సంతృప్తి పడింది సుజాత.

తన యెదుటినుండి సవ్యంగా వెళ్ళిపోతాడు. ఇదే తను వాడికి చేయగలిగిన సహాయం. ప్రస్తుతానికి తను తప్పించింది. ఈనాడు కాకపోయినా మరొక నాడైనా పట్టుబడే వాడే. దెబ్బలు తినే వాడే. జైలుకీ వెడతాడు. ఇప్పటికి ఎన్నిమార్లు వెళ్ళాడో కూడాను. వీడి బ్రతుకు బాగుపడదు. చెడుత్రోవను పోయే వాళ్ళకు మంచి మాటలు చెప్పినా చెవి కెక్కవు. ఇంతకీ యెవరి కర్మకు యెవరు కర్తలు!!

తన సమక్షంలో వాడికి హింస జరక్కుండా తప్పించింది. అదే తనకు తృప్తి.

సభ్యసమాజంలో అతకని బ్రతుకులివే. సంఘంలో సవ్యంగా బ్రతుకు వెళ్ళదీయక యిటువంటి అడ్డదారులు త్రొక్కి, వక్రమార్గాన పయనిస్తూ, క్షణక్షణం ప్రాణాలర చేత పెట్టుకుని భీతితో బ్రతికే జీవులు.

ఎవ్వరైనా పతనమార్గానికి మళ్ళకుండా వుండాలే గాని, మళ్ళితే ఆ భగవంతుడుకూడా వాళ్లను రక్షించడానికి అశక్తుడే నేమో!

ఇలా అనుకుంటున్న సుజాత కళ్ళు చెమర్చాయి.

ఆ కన్నీటి తెరల మధ్య తల వంచుకుని కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోతున్న సన్యాసి మసక మసకగా కనబడ్డాడు. *